# వోణీ రెపరెప

## పి.వి. కృష్ణమూర్తి

అనసూయమ్మ స్థాణువులా అయిపోయింది. ఆమె చూపులను కాంతి రాహిత్యం ఆవహించి అంతటా అంధకారం అలముకున్నట్టు తోస్తున్నది. అణువిస్ఫోటనం జరిగి అంతరంగం అధఃపాతాళానికి క్రుంగిపోతున్నట్టు వేదనాభరిత భావన.

అనసూయమ్మ వయసు అరవై అయిదు సంవత్సరాలు. అనుభవమూ, ప్రాయమూ వుడిగించిన ఆమె శరీరం నిస్సత్తువగా వాలుకుర్చీలో వేలగిలబడివున్నది.

ఆమె యెదుట ఆమె దౌహిత్రి లావణ్య నిలబడి నిశ్చల గాంభీర్యంతో చూస్తూవున్నది. షాంపూ చేసుకున్న ఆమె కురులు ఫాన్ గాలికి అలవోకగా అల్లాడుతున్నవి.

లాంటి తనేం బుద్ధిచెప్పగలదు.

"నా నిశ్చయం మారదు మామ్మా" అని కుండబద్దలు కొట్టినట్టు ముఖం మీదే చెప్పగలంత ధైర్యం ఈ పిల్లకు ఎలా వచ్చింది.

అనసూయమ్మ ఆలోచనలతో సతమతమౌతూ వుంటే బయట సైకిల్ గంట మోగింది.

ఇంతసేపూ ఆ మోతకోసమే ఆగివున్నట్టుగా వున్న లావణ్య తన చేతవున్న రెండు నవలలతో బయటకు ఒక్క పరుగు తీసింది.

ఆ పిల్లను వారించే శక్తి తనకు లేదనిపించిందామెకు. కళ్ళను గట్టిగా మూసుకుని కుర్చీలో అలాగే కూర్చుండి పోయింది అనసూయమ్మ.

---

"ఇక్కడి కెందుకు తీసుకువచ్చావు." అంది— అతడేమీ మాట్లాడలేదు. అప్పుడప్పుడే ఎదిగి పొంకాన్ని పొందుతున్న ఆమె ఎదను తన ఎదకు గట్టిగా అదుముకుని ఆమె పెదాలను ముద్దుపెట్టుకున్నాడు— ఏదో పారవశ్యంతో

---

కొద్ది క్షణాలుగా ఆ గదిని గంభీర నిశ్శబ్దం ఆవరించివున్నది.

వోణీ వేసుకుని ఇంకా సంవత్సరం కూడా తిరగలేదు అప్పుడే ఈ పిల్ల బుర్రలో ఇన్ని వూహలా, పచ్చని తీగయేదో, పసిరిక పామేదో తెలుసుకునేంత పరిజ్ఞానం కూడా లేదే.

అనసూయమ్మ వెన్నెముకలో సన్నని కంపరం మొదలైంది.

తలదించుకోవలసిన పిల్ల ఠీవిగా తలయెత్తుకు నిలబడి తనకు సమాధానం చెబుతోంటే తలపండిన తనే తలదించుకోవలసి వస్తున్నది.

అవును మరి సెలయేరులా దూకుడుగా పరుగులు తీసే వయసులో వున్న పిల్లకు జలింకి దీటులు వారదానికి సిద్ధంగా వున్న తటాకం

అలా అంతర్ముఖమైన ఆమె చూపులు గతంలోని తన జీవిత సంఘటనా దృశ్యాలను అప్రయత్నంగా చూడసాగినై.

తాము వుంటున్నది చిన్న పల్లెటూరు తండ్రిది వ్యవసాయం— అన్నయ్యకు రెండు మైళ్ళదూరంలోవున్న బస్తీలో తాలూకా ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం— రోజూ సైకిలు మీద వెళ్ళి వచ్చేవాడు. తనకూ అన్నయ్యకు పదేళ్ళ వార వున్నది. ఆ మధ్యన ముగ్గురు పిల్లలు పుట్టిపోయారుట— అన్నయ్యకు పెళ్ళి అయి వదిన కాపురానికి వచ్చింది— తను కడగొట్టు పిల్ల కావడంతో తల్లి గారాబంగా చూసుకునేది. తన చేత ఇంటి పనులు చేయించాలని వదిన పట్టుదల— ఆపనీ ఈపనీ పురమాయిస్తూ ఉంటే తల్లి అడ్డుపడేది— అది ఇంటి చాకిరీ చేస్తూ కూచుంటే చదువూ సంధ్యా అక్కరలేదా ఏమిటి అంటూ.

"నీ బొంద చదువు. అది బడికి తిన్నగా వెళ్ళి చదువువెలగబెడుతోందనేనా నీ ఉద్దేశం— ఎంతసేపూ గచ్చకాయలూ, వామనగుంటలు లేకపోతే చేల దగ్గర దాగుడుమూతలో ఆడుకోడం రివాజైపోయింది. దీని మీద ఫిర్యాదులు వినివిని విసుగెత్తి పోతున్నది. రేపోమాపో ఈడేరే పిల్లను కాస్త అదుపులో వుంచుకోనక్కరలేదా. మరిలా వెనకేసుకొస్తే ఏ రౌడీ వెధవో దీన్ని లేవదీసుకుపోతాడు— అప్పుడు లబోదిబో అన్నా లాభం వుండదు" అంటూ వదిన అమ్మతో వాదన పెట్టుకునేది.

వదిన చెప్పే ప్రతి మాటా నిజమే. తాను తల్లి అండ చూసుకుని, మెల్లగా బయటకు జారుకునేది. తిరిగి వచ్చి వదిన చేత తిట్లుతినేది అన్నయ్యకూడా వదిన పక్షమే.

అన్నా వదినా ఏకాంతంగా వున్నప్పుడు చాటుగా వుండి అంతా గమనించేది— తనకు మనసంతా ఎలాగో అయిపోయేది.

కొన్నాళ్ళకు తనకు వోణీ వేశారు ఆనాటి నుండి తనలో ఏదో మార్పు మనసులో యేదో గుబులు—

వదిన అన్నయ్య పక్కలో కూర్చున్నట్టే. తనూ యెవరి పక్కలోనైనా కూర్చుంటే బాగుణ్ణన్న భావన కానీ ఏదో సిగ్గు

"నాతో చెప్పకుండా బయటికి వెళ్ళావో కాళ్ళు విరగ్గొడతాను. జాగ్రత్త—" వదిన హెచ్చరించేది.

రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోవాలన్న కోరికతో వున్న తనకు వదిన గుదిబండలా తోచేది.

ఈ పరిస్థితిలో తండ్రి పోయారు. తరువాత ఇంటి పెత్తనమంతా అన్నా వదినలదే.

ఆ వూళ్ళో సినిమా హాళ్లు లేవు. సినిమా చూడాలంటే పక్కన బస్తీకి బండి కట్టుకువెళ్ళవలసిందే. అలా నెలకోసారో రెణ్ణెల్లకోసారో ఇంట్లో అందరూ కలిసి వెళ్ళివచ్చేవారు. ఎప్పుడైనా తమ వూరు బయటవున్న మైదానంలో డేరావేసి పాత సినిమాలు ఆడించేవారు. అలా ఈసారి డేరా వేసినప్పుడు అన్నా వదినా వూళ్ళో లేరు. వదినా వాళ్ళ నాన్నకు జబ్బుగా వుందంటే చూసి రావడానికి వెళ్ళారు.

వరవిక్రయం సినిమా ఆడుతున్నారు. తనకు చూడాలని వుంది. తల్లిని పోరుపెట్టింది. వెదవామని అంతదూరం నేను నడవలేను



తల్లీ. అంది తల్లి. అయితే నేనొక్క దాన్నే వెడతాను అంటూ మంకుపట్టు పట్టింది— తల్లి పావలా చేతిలో పెట్టింది.

అనసూయ ఆనందంతో గెంతుకుంటూ డేరా దగ్గరికి వెళ్ళేసరికిటిక్కెట్లు అయిపోయాయి

టిక్కెట్లు దొరికినవాళ్ళు డేరాలోకి వెళ్లారు. దొరకని వాళ్లు ఇళ్లకు మళ్లారు.

అనసూయకు డేరాలోకి వెళ్ళే అవకాశం లేక ఇంటికి తిరిగి వెళ్ళే ఇష్టం లేక డేరాకు అల్లంత దూరాన నిలబడిపోయింది. ఆమెకు దుఃఖం ముంచుకువస్తున్నది. ఇంతలో ఓ పద్దెనిమిది పందొమ్మిదేళ్ళ కుర్రవాడు ఆమె దగ్గరికి వచ్చాడు.

"ఎందుకేడుస్తున్నావ్" అన్నాడు.

"సినిమా టికట్టు దొరకలేదు".

"వొక్క దానివే వచ్చావా..."

"అవును"...

"నా దగ్గర రెండు అర్ధరూపాయి టికట్లు వున్నాయి"

"నా దగ్గర పావలానేవుంది "

అతడొక్క క్షణం అనసూయ కళ్ళలోకి గుచ్చి చూసి మట్టూ కలయజూసి "నేను నీకు పూరికేనే టికట్టు ఇస్తాను. ఇలారా" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని సమీపంలో ఉన్న చెట్ల చాటుకు తీసుకువెళ్ళాడు— "ఇక్కడి కెందుకు తీసుకువచ్చావు." అంది— అతడేమీ మాట్లాడలేదు. అప్పుడప్పుడే ఎదిగి పొంకాన్ని పొందుతున్న ఆమె ఎదను. తన ఎదకు గట్టిగా అదుముకుని ఆమె పెదాలను ముద్దుపెట్టుకున్నాడు— ఏదో పారవశ్యంతో అనసూయ మనసు గాలిలో తేలిపోయింది. తరువాత అతడు ఆమె చేతిలో టికట్టు పెట్టాడు ఎక్కడుంటావు. అడిగాడు. తను ఇంటి గుర్తులు చెప్పింది. ఎవరూ గమనించకుండా అతడు వెళ్ళిపోయాడు

అనసూయ డేరాలోకి దూరింది. అప్పుడే ఆట మొదలైంది. కష్టం మీద కాస్త చోటు దొరికింది.

ఆమె ఆట చూస్తున్నదేగాని మనసంతా ఇంకా ముద్దుమైకంలోనే వున్నది.

సినిమా అయ్యాక ఆ రద్దీలో అతడు కనిపించలేదు. బిక్కుబిక్కుమంటూ తను ఇంటికి వచ్చింది.

తన పావలా అలాగేవుంది. మరో ఆటవేసినప్పుడు వెళ్ళొచ్చనుకుంది. కాని ఇంతలో అన్నా వదినా వచ్చేశారు— తనకు పెళ్ళి సంబంధం కుదుర్చుకు వచ్చినట్టు వదిన తల్లితో చెప్పింది.

అనసూయ మనసులో మాత్రం ఆ కుర్రాడే మెదులుతున్నాడు. ఆ కుర్రవాడు ఇంటి గుర్తులు కనుక్కుని వచ్చి ఇంటి ముందూ పెరటివైపూ తచ్చాడుతుండడం గమనించింది అనసూయ కాని తనకు పెళ్ళి సంబంధం కుదిరింది గనుక, వదిన తనను చాలా కస్టడీలో వుంచుతోంది. వొక సాయం కాలం అతడు పెరటివైపు వచ్చినట్టు తెలిసి చడీచప్పుడు

గాకుండా పెరటి తలుపు తీసుకుని వెళ్లింది. అతడు నిముషం ఆలస్యం చెయ్యకుండా తనను వాటేసుకుని ముద్దులతో ముంచెత్తి వుక్కిరి బిక్కిరి చేశాడు— అతనితో తన పెళ్ళి సంగతి చెబుతూ వుంటే వదిన పిలుపు వినిపించి— అతణ్ణి విడిపించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఆ శనివారంనాడు తను వదినతోపాటు గుడికి వెడితే అక్కడ తటస్థపడ్డాడు— ఏమీ ఎరగనట్టే తమతోపాటే ప్రదక్షిణాలుచేస్తూ వదిన గమనించకుండా తనచేతిలో వొక ఉత్తరం పెట్టాడు. దాన్ని భద్రంగా జాకెట్టులో దాచుకుని ఇంటికి వచ్చి చాటుగా చదువుకుంది. "రేపు సాయంత్రం తం దేరా దగ్గరికి వచ్చేసెయ్. సినిమా చూశాక. మా వూరికి అంటే పక్క గ్రామానికి వెళ్ళిపోయి అక్కడ పెళ్ళి చేసుకుందాం" అని వుంది.

అనసూయ గుండె దడదడ లాడింది. ఆ వుత్తరం వదినకంటబడితే ఇంకేమైనా వుందా, దాన్ని చింపబోతుంటే వదిన రానేవచ్చింది.

పర్యవసానంగా ఎంత గొడవ జరగాలో అంతా జరిగింది— వదినను కత్తితో పొడిచేయాలన్నంత కోపం వచ్చింది ఆమె అనేమాటలకు. కానీ ఏమీ చెయ్యలేక ఆమె కుదుర్చుకువచ్చిన వరుడిచేతనే తాళి కట్టించుకుని కాపురానికి వెళ్ళిపోయింది.

తన మనసునిండా అతడే మెదులుతూ వుంటే మొగుడి మొదటి ముద్దు యెలాంటి అనుభూతినీ ఇవ్వలేదు. కొంత కాలంపాటు యాంత్రికంగానే భర్తతో జీవితం పంచుకున్నది. రోజులూ,నెలలూ సంవత్సరాల్లోకి దొర్లిపోతూ వుంటే తన ప్రియుడు మరుగున పడిపోయాడు— కానీ వదిన మీద పెంచుకున్న కసి మాత్రం అలాగే వుండిపోయింది.

తనకు ఇరవై రెండో ఏట తొలి చూలు కూతురు పుట్టింది. ఎందుకో గాని పుట్టింది కూతురా అన్న భావం ఆమెకూ కలిగింది. పసిబిడ్డ అని ఎత్తుకున్నా పెద్ద బండను మోస్తున్నట్టు గుండెల మీద బరువు— ఆ పిల్ల భవిష్యత్తుమీద ఆలోచనలు— మూడేళ్ళ తరువాత మళ్ళీ ఆడపిల్లనే. అనుకోకుండానే ఆమె హృదయం నీరసంగా ఆక్రోశించేది.

పెద్దపిల్ల సుమ చూస్తూ వుండగానే ఎదిగిపోయింది. ఆ పిల్లకు వోణీ వేస్తుంటే అనసూయకు చేతులు అప్రయత్నంగా వణికినై— ఆ దశలో తన అనుభవం గుర్తుకు వచ్చేది- దాంతో మనసునిండా చెప్పుకోరాని ఆవేదన— వ్యక్తి స్వతంత్రానికీ సాంప్రదాయానికీ మధ్య సంఘర్షణ— స్త్రీ జీవితం కట్టుకొదిగిన ప్రవాహంలా వుంటేనే గౌరవం కాని ఇప్పుడు తరం మారిపోయింది. లంగావోణీల స్థానంలో పంజాబీ దుస్తులు, పాంట్లూ, షర్టులూ ఫాషనైపోయింది. ఈ పిల్లల భవిష్యత్తు ఎలా వుంటుందో చెప్పలేం—

వొక మహావృక్షం ఎదుగుతున్న చిన్న మొక్కల్ని చూస్తున్నట్టు వుంది తన పని— ఆ మొక్కలు గాలికి వూగినా, ఎండకు ఎండినా, మేకలు మేసినా పెద్ద వృక్షం ఏం చెయ్యగలదు.

కాలం పరుగులు తీస్తోంది— భర్త రిటైర్ అయిపోయారు. ఇద్దరు కూతుళ్ళకీ పెళ్ళిళ్ళుచేసి తరువాత కన్నుమూశాడు అటు తన పుట్టిల్లు కూడా బుగ్గిఅయిపోయింది.

తను వొంటరిదై పోయింది— కూతుళ్ళ దగ్గరికి వెళ్ళడం ఇష్టంలేక వొంటరిగానే వుండడానికి నిశ్చయించుకుంది.

అదేం గ్రహచారమో సుమకూ తొలిచూలు ఆడపిల్లనే. తరువాత సంవత్సరానికి రమకూ ఆడపిల్లనే.

మళ్ళీ గుండెల మీద ఏదో బరువు మోయలేక దించలేక మనసులో ఆందోళన.

ఆ పిల్లలూ ఎదుగుతున్నారు.

సుమ భర్తకి ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ అయింది. సుమ కూతురు లావణ్య తొమ్మిదో క్లాసులోవుంది మెట్రిక్ పూర్తి అయ్యేవరకు నీ దగ్గరనే వుంచుకో అంటూ సుమ ఆ పిల్లను తన దగ్గర వదిలివెళ్ళింది వాళ్ళు వెళ్ళిన వారానికి లావణ్య ఈడేరి కూచుంది.

లావణ్యకు వోణీ వేస్తూ వుంటే ఆమె చెయ్యి మళ్ళీ వణికింది.

ఆ వయసులో తనకున్న తిక్క బుద్ధులన్నీ ఆ పిల్లకూ వున్నవి— ఎటొచ్చీ ఆ పిల్ల చదువుకుంటోంది.

ఇప్పుడు దీనికి లెండింగ్ లైబ్రరీ కుర్రవాడు యెవడో దొరికాడు.

ఇంటి ముందు వాడి సైకిల్ గంట వినిపించడమే ఆలస్యం. బయటకు పరుగులంకించుకుంటుంది.

ఆ పిల్లను వాడేం చేసిపోతాడో నన్న భయం.

ఆమాటే చెప్పి మనవరాల్ని మందలించింది

"అలాంటి దేమీ జరుగదు మామ్మా! మేం జాగ్రత్తగానే వుంటున్నాం" అంటూ సెక్సువిజ్ఞానం అంతా వొలకబోసింది.

"నేను పెళ్ళంటూ చేసుకుంటే అతణ్ణే చేసుకుంటాను" అని కరాఖండిగా చెబుతున్నది లావణ్య.

ఇంక ఈ పిల్లను తాను సంబాళించగలదా— సుమకు తానేం జవాబు చెప్పగలదు.

ప్రతి స్త్రీ చరిత్రా ఇలాగే పునరావృతం అవుతుందా.

ఆమె ఆలోచనలనుండి తేమిలి ప్రస్తుతానికి వచ్చేసరికి ఎంతసేపైందో ఏమో— తన యెదుట ఎక్కడికో వెళ్ళడానికి తయారై నిలబడివున్నది— తెల్లటి లంగా జాకెట్టు ధరించి గులాబీ రంగు వోణీ వేసుకున్నది— ఫాన్ గాలికి వోణీ సుతారంగా రెపరెపలాడుతున్నది.

"నేను సినిమాకు వెడుతున్నాను మామ్మా. అతడు పాస్ తెచ్చాడు" అంటూ తన సమాధానానికి ఎదురుచూడకుండానే వెళ్ళిపోయింది—

తన చిన్నతనం గుర్తుకు రావడంవల్లనో— పెద్దతనం గుర్తింపుకు రాకపోవడంవల్లనో గాని అనసూయమ్మ నీరసంగా నిర్వీణ్ణంగా నిర్నిమేషంగా కూర్చుండిపోయింది. ✱



**లోన్**

"లోన్ కావాల, ఎందకమ్మా?" అడిగాడు లోన్ ఆఫీసర్.

"ఓ మంచి మొగుణ్ణి కొనుక్కోవడానికి సార్" సిగ్గుపడుతూ చెప్పింది రాధ.

—పద్మశ్రీ (మాణిక్యారం)

